నాడు పట్నమంతా సుబ్బక్క ముఖంలో కొత్తవెలుగు చూచేరు. "సుబ్బక్కా! యీ వేళ బాగున్నావు!" అని అంతా అంటే సుబ్బక్క అంది "ఉన్నానుకమోసు—తల్లుల్లారా! తండ్రుల్లారా! ఇన్నాళ్ళమల్లే కడచిన మాపు నేలమీద చెమ్మలో తొంగుడుండలేదు నేను. మీ దయవల్లా మీ దయవల్లా ఓ మడత మంచం నిన్న సంపాదించుకుని అందుమీద తొంగుడుండాను. అందుమూలాన్ని కమోసు కాస్తంత జలుబూగిలుబూ వదిలి నేవళీకంగా కనబడుతున్నాను. అయినా చెప్పదగ్గ అందం నాలో ఏముంది? నే చూచిన దీపంలోవుంది!"

అలా అంటూంటే నిజంగా సుబ్బక్కకళ్లు మెరిసిపోయి నాయి. పట్నమంతా సుబ్బక్క ముఖంలో కొత్తవెలుగు చూచేరు.

.... .... .... .... ....

## ఎద్దడి నీళ్లు

వ్రాసినకొద్దీ వ్రాతకూడా దారిద్ర్యం అబ్బిపోతుందేమో అనే భయంవేస్తూంది.

వ్రాస్తే వ్రాత కోభాగ్యం అనుకుంటే ఒకముక్క వ్రాయ వచ్చును.

కళ్ళల్లోకంటా ఎటుచూచినా, చెవుల్లోకల్లా ఎటువిన్నా వేదిగాడుపే.

"నీ కలా యుండాలని నా కోరికే. నీ వలాయుండాలని నా కోరికే."

ఇచ్చేస్తోందిగదా ఎందుకు తీసికోకూడదు అని వాని యూహ.

"ఏం తిరిగి పట్టుకొచ్చేవు ? వెఱ్ఱిముండాకొడకా !" అంది యువతి.

"నీ యవ్వనం తగులబెట్ట చావలేకపోయేవు అనాడు" అన్నాడు లోపలికి వెళ్ళి.

"ఎద్దడినీళ్ళవడంచేత చావలేదు" అంది ఆమె అతి నిబ్బరంగా.

ఊరంతా నుయ్యి బలికోరిందనుకొన్నారు.

ఒక ధర్మచావడి—ఒక యేఱు—అవే మన యీ కథకు గావలసినవి. మిగతా యూరెంతున్నా యెక్కడున్నా మనకక్కర్లేదు. ఆ రెండూ మీ రానవాలు పట్టగలిగినారా అంటే ఊరేదో తెలిసిపోయిందన్నమాటే. ఊరెంతుందో బోధపడ్డాదన్నమాటే. ఏమాఅంటే మన యీ కథకు నాయకీనాయకులు ముష్టివాళ్ళు. వాళ్ళకు వేఱే ఇల్లూవాకిలీలేదు. ధర్మచావడిలోనే బస. వాళ్ళకు మంచినీళ్ళకు ఆదరువు వేఱే నుయ్యీ, చెరువూ ఏమీలేవు. దూరాన్నే ఓ పుంతమ్మటే పోగా తగిలే పోల్నాటి సెలయేఱే ఆధారం. ఆ యేటికీ యీ చావడికీ మధ్యజరిగిన కథయిది. రెండో కంటివా డెఱుగనిదీ.

పుంతలో మొదటో వేపచెట్టు, ఆ వేపచెట్టుదాటి ఓమలుపు తిరిగితే మఱోవేపచెట్టు. అంతే చెట్లు. ఎక్కడన్నా బ్రహ్మదండి పొదలు. పుంతంతా గులకరాయీ, గండ్రిసుకా, కాలిని మండు వేసంగి. వేళ మిట్టమధ్యాహ్నం.

వాళ్ళిద్దఱూ పుంతమ్మట పోతూవున్నారు. వాళ్ళనగా బిచ్చగాడూ, బిచ్చకత్తె. వాళ్ళకు పేర్లు లేవా అంటారేమో ? బిచ్చగాళ్ళను బిచ్చంవేసీ వెయ్యడంలో పొమ్మనడమేగాని నీ పేరేమిటి

వీయూరేమిటి అనే వాకబు నాకెప్పుడూలేదు. నాకేకాదు. ఎవరికీ వుండదనే నాయూహ. మన మహాభాగ్యవంతుణ్ణయినా కలుసుకున్నామా అంటే వాని పుట్టుపూర్వోత్తరమంతా వాళ్ళవల్లా వాళ్ళ వెనకాతలే నడిచేవాళ్ళవల్లా తెలిసికొంటేనేకాని తోచదు. ముష్టివాళ్ళను గుఱించి అలా తెలిసికుందామని వుండదు. ఎంచేతో? అది లోకప్రకృతి అనుకోవాలి అంతే. లేకపోతే మనుష్యతత్వం అనుకోవాలి.

బిచ్చగాడూ బిచ్చకత్తే పుంతమ్మటే పోతూవున్నారు. బిచ్చకత్తె బుజాన్ని ఒకకుండవుంది బిచ్చగాని బుజాన్ని ఒక గడ్డపాఱవుంది. బిచ్చకత్తెకాళ్ళను తాటిమట్టలు విఱిచికుట్టిన ఒక ఆకుజోడు ఆకారంలాంటి జోడువుంది. బిచ్చగాడికాళ్ళని ఎవరి కాళ్ళనో అరిగిపోయి పారేయగా దొరికిన పాతచెప్పులజోడొకటి వుంది. మిగిలిన వస్తువాహనాలు, వస్త్రలాంఛనాలూ దాన్నిబట్టి యూహిస్తేనే మంచిది. వ్రాసినకొద్దీ వ్రాతకూడా దారిద్ర్యం అల్లిపోతుందేమో అనేభయం వేస్తూంది.—

వాళ్ళ నలావిడిచిపెట్టి ఒకడుగు ముందుకుపోదాం—ఒక అయినింటియువతి. పచ్చని శరీరచ్ఛాయ. పదాఱువన్నెకథానిననుకరిస్తూవుంది. ఒంటిమీద ఒల్లె వీపుయొక్క సౌష్టవం చూపిస్తూవుంది. చేతుల కంకణాలు, పోచీలు. కాళ్ళను కడియాలు, అందెలు, మెళ్లో కంటె, నాను, పుస్తెలు, బుజాన్నొకబుత్తడి బిందె, ఇత్తడిబిందెతో ఒక ఇనపగరిటె. ఇనపగరిటె నల్లగా పైకి తనయొక్క మొన చూపిస్తూవుంది. ఆమె కాళ్ళని జోడూ లేదు. ఆమె నెత్తిని గొడుగూలేదు. వెనుక చూపులేదు. వెడుతూ వుంది ఏటిపంటకే. ఈపెనుగురించి వ్రాయ్యనక్కఱలేకుండానే

చెప్పవచ్చును భాగ్యశీల అని. వ్రాస్తే వ్రాతకోభాగ్యం అను కుంటే ఒక ముక్క వ్రాయవచ్చును. ఆమె యౌవనం బరాబరికి అప్పుడే వచ్చియుంటుందని వ్రాస్తే వ్రాయవచ్చును. తీంగ్రపు టెండనే తియ్యనిచూపులు. వడగాడుపునే చల్లని యూరుపు. ఆపె కనక ఆ మార్గాన్ని ముందునడుస్తూ వుండకపోతే బిచ్చగాడూ బిచ్చకత్తె దారిలో ఆ పాటికే శోషిల్లిపోయి యుందురనుకోవాలి.

బిచ్చగాడామెను చూస్తూ అన్నాడు తన పెళ్ళాంతో "ఓలేవు పోలీ! నీళ్ళుంటాయె, యేటిలో నీళ్లుంటాయే. నేను తవ్వక్కఅలేదనుకుంటానే" అన్నాడు. బిచ్చకత్తెఅంది "ఏం?" అని. "ముందు మనలాగే వెడుతున్నారుకదా జనం. నీళ్ళు లేకపోతే వెడతారనా నీయూహ?" అన్నాడు బిచ్చగాడు. "అంః— చేరే శక్తి ఉండొద్దు? మనకు ఉండొద్దు మనకు?" అంది బిచ్చకత్తె.

ఇంకా కొంచెంవడిగ్గా నడుస్తున్నారు పేదదంపతులు. "మన ముసిలిబాపనయ్యగారి పడుచుభార్యాగారల్లే వున్నారే. మంచినీళ్ళుకావాలంటే సర్వం గొల్లకందా గొల్లకిటమ్మనేత పోయించుకోరాదంటే. ఇందాకా యీ యెండలో నడచిరావడం ఎందుకే.—ఆలా ఆ మాటికొస్తే మనమేనయం. కాళ్ళ కేచినుగుజ్జోడో ఏ తాటిపీచో ఆధారంచేసుకొని నడుస్తున్నాము. ఆవిడ చిందులు తొక్కవలసివస్తోందే. ఇసకలో గంగ్రిసకలో అయ్యో పాపం! నిలవనీదైనాలేదే. మనిద్దఱం ఏదన్నా ఉల్లఖంలాగ పడితే బాగుండిపోనే. నాకు చాలా జాలేసిపోతుందే, పోలీ! నాకు చాలా జాలేసిపోతూంది." అన్నాడు బిచ్చగాడు.

పోలికాళ్ళను తాటిమట్టజోడు వదప తెగిపోయింది. పోలికి వడకొట్టింది. పోలి క్రిందపడిపోయింది. పోలియొక్క బుజాన్నివున్నకుండ నేలబడి చితికిపోయింది. బిచ్చగాని కేమి చేయడానికి తోచలేదు. కేకవేసి ముందుపొయ్యేమనిషిని వెనక్కి పిలి స్తేమాత్రం లాభం ఏమిటి? ఆవిడబుజాన్ని వున్నది ఉత్త బిందే. ఆవిడ పోయేది ఏటికే. పోనీ తిరిగి ఆవిడవచ్చేదాకా కనిపెట్టుకూర్చుంటాడా బిచ్చగాడు? కూర్చుంటే ఆ లోపునే నాలికార్చుకుపోయి పోలి ప్రాణంపోతుందేమో. పోనీ పరుగెట్టు కెడతాడనుకుందాం. దేనితోనీళ్ళు పట్టుకువస్తాడు? కుండ పగిలి పోయింది. కళ్ళల్లో కంటా ఎటుచూచినా, చెవుల్లోకళ్ళా ఎటు విన్నా వేడిగాడుపే—ముందుకు రెండడుగులువెళ్ళి రెండడుగులు ~~వెనక్కి~~వచ్చి పోలికేసి ఓమాటు చూచి మళ్ళీ ముందుకుసాగినాడు. ఎండిన సెలయేటి యిసక మిలమిలామంటూ ఇగబారెడులెక్కలో అనేటట్టుంది.

బ్రాహ్మణయువతి, యెండిపోయిన యేటియిసుకలో ఆ యుదయంతీసిన చలమ మధ్యాహ్నానకెండిపోయిన కారణం చేత గరిటెతో యింకా తవ్వుతూ నీళ్ళయూటకోసం ఎదురుచూస్తూ వుంది. చాలా వేడిగావుంది. చెమ్మటతోపాటు అదోవిధమైన మైకంకూడా కప్పివేస్తూ వుంది ప్రతీజీవరాశిని.

"పోలీ!" అని ఒక ఏసతో ఒక గట్టికేక వేసినాడు పిలిచినట్టుగా బిచ్చగాడు. బిచ్చగాడి బుజాన్నివున్న గునపం వాడిబుజాన్ని అలాగేవుంది. "పోలీ" అని ప్రతిధ్వనించింది అంతరాళం. బ్రాహ్మణయువతికి పై ప్రాణాలు పై కెగిరి పోయాయి. బిచ్చగాడనుకొన్నాడు—పైకి నాటకరంగస్థలంమీది

స్వగతమంత గొంతెత్తి—“నీకలాయుండాలని నాకోరికే—నీవలా యుండాలని నా కోరికే — అలావస్తువుపెట్టుకుని అలావర్చస్సు గలిగి అలా యౌవనం వెలిగ్రక్కుతూ అలా నివ్వుండాలని నా కోరికె—కాని నీ జీవితం నా జీవితం భగ్నములైపోయినాయి. యీనాడు నీకు మంచినీరం మోసికొని పోవడానికి కుండకూడా లేకపోయెనే?” అని పెద్ద పెట్టున నేడ్చినాడు.

బ్రాహ్మణయువతి గుండెలో రాయిపడింది. “భగవానుడా! ఇంట ముసిలిభర్త కొనయూపిరితో నున్నాడు. బిందెడు మంచి నీళ్ళు వుదయం తెచ్చిన వుదయమే అయిపోయినయి సగంనీళ్ళు బిందెలోనే ఆర్చుకొని పోయినవనవచ్చును. దాహము దాహ మనువాని కింత దాహమిచ్చుటకైనా నోచకుండ వీడీబిందెనెత్తు కొని పోడుగదా?” అని యేమేమోదోచి నిలువునా నిశ్చేష్ట రాలై నిలుచుండిపోయింది. కొంతసేపు బిచ్చగాడు నిశ్శబ్దంలో లీనమైనట్టుండిపోయినాడు. ఆ లోపున బ్రాహ్మణయువతి ఊటిన నీటిలో తన బిందెముంచి పైకితీసి గట్టున పెట్టుకొన్నది.

“ఆనీళ్ళు ఆ బిందె నేనెత్తుకొనిపోయి నా భార్యను రక్షించుకొందు. నా భార్యను రక్షించుకొందు. నా భార్యను రక్షించుకొందు. తల్లీ!” అన్నాడు. “తీసికోమంది” ఇల్లాలు. “ఆ వస్తువులు కావా” లన్నాడు బిచ్చగాడు. వలిచి అక్కడ పెట్టింది ఆబిడ. లేకపోతే చంపేస్తాడనే భయం—ఆమెకు.— ఇచ్చేస్తోందిగదా ఎందుకు తీసికోకూడదు అని వానియూహ. వాడు వాటిని తీసికొంటూ ఒకచూపుమాత్రంగా ఆ యువతికేసి చూసి ఆ పిల్ల బెదరిపోతూవుంటే వెఱ్ఱినవ్వు నవ్వుకుంటూ వెళ్ళి పోయినాడు.

భైక్షుకదంపతులూ ఆ బిందే ఆ వస్తువులూ తిరిగి ఎవరికీ ఎక్కడా పట్టుపడలేదు. కాని దొంగఎవడో ఆవిడ వస్తువులూ బిందే బలాత్కారంగా తీసికొనిపోయినాడనీ వెల్లడైంది.

* * * * *

కొన్నాళ్ళకు ముసిలిమొగుడు అరుగుమీద కూర్చొని యుండగా బిచ్చగాడువచ్చి "స్వామీ! మీ ఆవిడ ఆనాడు నాకిచ్చిన బిందే, వస్తువులు" అన్నాడు. "ఏం తిరిగి పట్టు కొచ్చేవు. వెఱ్ఱిముండాకొడకా!" అంది యువతి అప్పటికి కొంచెం ఆరితేరిన గొంతు కనబట్టో ఇంటనుండబట్టో—"నాపోలి చచ్చిపోయింది. నా పోలి చచ్చిపోయింది ఇంకెవరికి?" అని ఏడుస్తూపోయినాడు బిచ్చగాడు.

వృద్ధభర్త కేమనడానికీ పాలిపోలేదు. "నీ యవ్వనం [illegible]బెట్టి చావలేకపోయేవు ఆనాడు." అన్నాడు లోపలకువెళ్ళి. "ఎద్దడినీళ్ళవడంచేత చావలేదు" అంది ఆమె అతినిబ్బరంగా.

ముసిలిబాపనయ్య కుళ్ళికుళ్ళి చనిపోయినాడు. కాని ఆమెకు వర్చస్సు మాఱలేదు.—

కొన్నాళ్ళకు నడువీధిలో మంచినీళ్ళనుయ్యి తీయించేరు సర్కారువారు. నూతిప్రతిష్ఠయిననాటిరాత్రే ఆ బాపనవితంతువు అందులోపడి మృతిజెందింది. ఊరంతా నుయ్యి బలికోరిందను కొన్నారు.

.... .... .... .... ....

## సుకారీ, లంబాడీ, మరాటీ

"సుకారీ, లంబాడీ, మరాటీ" ఈ తెగల్లో ఏ తెగవాళ్ళు వీళ్ళని చూస్తున్నాను—గుంపుగా కొందఱు గోదావరివంచే దిగి అవతల